సాక్షి శ్రీకాకుళం

గురువారం : 28 : మార్చి : 2024



ఘనంగా చందనోత్సవం

మదీనాబాబా చందనోత్సవం ఘనంగా జరిగింది. పెద్ద ఎత్తున జనం హాజరయ్యారు.


- 8లో



కన్యాశుల్కం అదరహో

కన్యాశుల్కం నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లా కేంద్రంలో ఈ ప్రదర్శన నిర్వహించారు.

- 8లో



ఇఫ్తార్	సహర్
గురు	శుక్ర
సాయంత్రం	ఉదయం
6.11	4.37

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

అమ్మో.. ఎలుగు



మామిడిపల్లి దేవాలయంలో ఎలుగు బంటి

పలాస: మామిడిపల్లి గ్రామంలోని సమీప దేవాలయంలో బుధవారం ఓ ఎలుగు పట్టపగలు నిద్రిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. జీడి తోటలకు వెళ్తున్న రైతులకు ఈ ఎలుగు బంటి తారసపడింది. రైతులు కేకలు వేసినా కనీసం పట్టించుకోకుండా నింపాదిగా లేచి తన భీకర రూపాన్ని చూపి నడుచుకుంటూ వెళ్లింది. దీంతో రైతులు చాలా భయపడ్డారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఉద్దానం ప్రజలు కోరుతున్నారు.

'నిబంధనల మేరకే క్రయవిక్రయాలు'



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ నాగార్జునరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లాలో ఒడిశా సరిహద్దు ప్రాంతాలు, అంతర్‌రాష్ట్ర, అంతర్ జిల్లాల సరిహద్దుల్లో జీఎస్టీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జీఎస్టీ జాయింట్ కమిషనర్ బుడుమూరు నాగార్జునరావు అన్నారు. ఎన్నికల నిబంధనలు పాటించకుండా క్రయవిక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శ్రీకాకుళం నగరంలో విజయనగరం డివిజన్ ట్రేడ్‌యూనియన్ సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో భాగంగా ప్రజలకు తాయిళాలు ఇచ్చేందుకు అధిక మొత్తంలో కొనుగోలు చేసిన వారిపై వ్యాపారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా పైడిభీమవరం, ఒడిశా సరిహద్దు ప్రాంతంలో బత్తిలి, మాతల, పాతపట్నం, పురుషోత్తపురంల వద్ద ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, రాపిడ్ యాక్షన్ టీమ్‌లు ప్రతి రోజూ చెక్‌పోస్టు పాయింట్లను తనిఖీ చేయాలన్నారు. వస్తువుల కొనుగోలు, అమ్మకాలపై సంబంధిత ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ జి.రాణిమోహన్, సిహెచ్.కొండమ్మ, డిప్యూటి అసిస్టెట్ కమీషనర్లు ప్రతిభ, చంద్రకళ పాల్గొన్నారు.

క్షేత్ర సహాయకుడు లోకనాథంపై వేటు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మందస మండలం తాళ్లగురంటి పంచాయతీకి చెందిన ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు (ఫీల్డ్ అసిస్టెంట్) నల్ల లోకనాథం చౌదరిని విధుల నుంచి తప్పించినట్లు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పథక సంచాలకులు జీవీ చిట్టిరాజు తెలిపారు. లోకనాథం రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నట్లు ఫిర్యాదు రావడంతో స్వయంగా విచారణ చేపట్టిన పలాస రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ భరత్ నాయక్ దాన్ని ధ్రువీకరించారు. దీంతో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లు స్పష్టం కావడంతో లోకనాథం చౌదరిని విధుల నుంచి తప్పించినట్లు మంగళవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రూ.80 వేలు స్వాధీనం



బొలెరో పికప్ లగేజి వ్యాన్ తనిఖీ

బూర్జ: మండలంలోని కొల్లివలస జంక్షన్ వద్ద బుధవారం నిర్వహించిన తనిఖీల్లో రూ.80 వేలతో ఒక వ్యక్తి పట్టుబడినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ సరుబుజ్జిలి, బూర్జ టీమ్ 01 మేజిస్ట్రేట్ ఆర్ఎస్ డీటీ ఎస్.వెంకటరావు, ఏఆర్ ఎస్ఐ వై.వెంకటేశ్వరరావు తెలియజేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది తెలియజేసిన వివరాలు ప్రకారం పార్వతీపురం మన్యం జిల్లా, గురుగుబెల్లి మండలం, కొత్తపల్లి గ్రామానికి చెందిన పత్తిగూల కామేశ్వరరావు పాలకొండ నుంచి ఆమదాలవలస వైపు వస్తుండగా.. అధికారులు బొలేరో పికప్ లగేజీ వ్యాన్ ఆపి తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేని రూ.80 వేలు దొరికాయి. ఈ నగదు ఎక్కడకు తీసుకెళ్తున్నారని ప్రశ్నించగా శ్రీకాకుళంలో ప్లేవుడ్ సీట్లు కొనేందుకు తీసుకెళ్తున్నానని ఆయన చెప్పారు. అయితే నగదుకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని ఆయనను బూర్జ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కమ్మగా వెన్నుపోటు



- ఎచ్చెర్లలో బీజేపీ తరఫున కూటమి అభ్యర్థిగా నడికుదుటి ఈశ్వరరావు
- తూర్పుకాపుల నియోజకవర్గంలో కమ్మ అభ్యర్థి
- కళా, కలిశెట్టిలకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: అనుకున్నదంతా అయ్యింది. అధిష్టానంతో సంప్రదింపులు జరిపినా.. మంగళగిరిలో కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేసినా ఎచ్చెర్ల టీడీపీ ఆశావహులకు నిరాశ తప్పలేదు. తూర్పుకాపులు అత్యధికంగా ఉన్న ఎచ్చెర్ల నియోజకవర్గంలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన నడికుదుడి ఈశ్వరరావును బీజేపీ తరఫున కూటమి అభ్యర్థిగా ప్రకటించారు. ఐదేళ్లుగా అక్కడ టీడీపీని నిలబెట్టుకుంటూ వస్తున్న కళా వెంకటరావు, కలిశెట్టి అప్పలనాయుడులకు వెన్నుపోటు పొడిచి సీటును బీజేపీకి కట్టబెట్టేశారు. వీరిద్దరి తగువు తీర్చలేక బీజేపీకి కేటాయించి తమ సామాజిక వర్గ నాయకుడిని అభ్యర్థిగా ప్రకటించేలా చంద్రబాబే పావులు కదిపారన్న వాదనలూ వినిపిస్తున్నాయి.

టీడీపీ సీనియర్ నాయకుడు కిమిడి కళా వెంకటరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. గత 58 నెలలుగా పార్టీ కోసం కోట్లాది రూపాయలు వెచ్చించారు. గత ఎన్నికల్లో ఓటమి దగ్గర నుంచి పార్టీ కోసం అహర్నిశలు పనిచేశారు. ఇదిగో టికెట్ అని చెప్పి ఇద్దర్నీ ఊరించారు. ఆఖరి వరకు వారి సేవలను వాడుకున్నారు. టికెట్ ఖరారు చేసే సమయానికి యూజ్ అండ్ త్రో మాదిరిగా వదిలేశారు. చంద్రబాబు నిర్వాకం చూసి టీడీపీ నాయకులు మండిపడుతున్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం పొత్తు పెట్టుకుని మమ్మల్ని బలి పశువు చేశారని ఆ పార్టీ నాయకులే దుమ్మెత్తి పోస్తున్నారు. డిపాజిట్లు రాని వ్యక్తికి టికెట్ ఇస్తే ఏం ప్రయోజనమని దుయ్యబడుతున్నారు. ఇక్కడ బీజేపీకి అంత సీన్ ఉందా.. అందులో ఎన్ఈఆర్‌కు కనీస ప్రజాదరణ ఉందా.. ఏమీ లేని వాడికి టికెట్ ఇస్తే మేం పనిచేయాలా? అలాంటి వ్యక్తికి తాము ఎట్టి పరిస్థితుల్లో సహకరించేది లేదని.. ఓడిస్తామని టీడీపీ శ్రేణులు శపథం పూనుతున్నాయి. ఇప్పటికే ఎన్ఈఆర్‌కు వ్యతిరేకంగా సోషల్‌మీడియాలో విస్తృతంగా ట్రోల్స్ జరుగుతున్నాయి.

ఇక్కడి టికెట్ ఆశావహుల్లో కళా వెంకటరావును విజయనగరం జిల్లాకు పంపించే ప్రయత్నం చేస్తుండగా కలిశెట్టి అప్పలనాయుడును గాలి కొదిలేశారని, ఇప్పుడు తామంతా బీజేపీ అభ్యర్థికి ఊడిగం చేయాలా.. అని సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. టికెట్ రేసులో చివరి వరకు ఉండి భంగపడ్డ కలిశెట్టి అప్పలనాయుడును ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. అధిష్టానం తీసుకున్న నిర్ణయంపై కలిశెట్టి అప్పలనాయుడు కూడా ఏం చేయాలన్న దానిపై అనుచరులతో మంతనాలు జరుపుతున్నారు. పార్టీకి కష్టపడి పనిచేస్తే ఇచ్చిన గౌరవం ఇదేనా అని కలిశెట్టి అప్పలనాయుడు కూడా మదనపడుతున్నారు.

ముందే తెలుసా..?

ఎచ్చెర్ల సీటు బీజేపీకి అందునా తన సామాజిక వర్గానికి చెందిన ఈశ్వరరావుకు కేటాయించాలని చంద్రబాబు మదిలో ముందుగానే ఉందనే వాదనలూ వినిపిస్తున్నాయి. చంద్రబాబు తెలిసే కళా వెంకటరావు, కలిశెట్టిని వాడుకుని వదిలేశారని, తన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కోసం సొంత పార్టీ నాయకులకు అన్యాయం చేశారని ఆ నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. తూర్పు కాపులు ఎక్కువగా ఉండే నియోజకవర్గంలో క మ్మ సామాజిక వర్గానికి సీటు కేటాయించడమేంటని తప్పు పడుతున్నారు. దీనిపై ఎప్పటికప్పుడు లీకులు వచ్చినా స్థానిక టీడీపీ క్యాడర్ పెద్దగా నమ్మలేదు. ఇప్పుడు అభ్యర్థిని ప్రకటించడంతో అంతా నిశ్చేష్టులైపోయారు.

శ్రీకాకుళం అభ్యర్థిని మార్చాల్సిందే

- టీడీపీ క్యాడర్ డిమాండ్
- అధిష్టానం ప్రతినిధి శ్రీనివాసులురెడ్డి ఎదుటే అల్టిమేటం జారీ
- టీడీపీ క్యాడర్‌ను రోడ్డుకీడుస్తానని శంకర్ చెప్పడంపై ఫిర్యాదు
- లోకేష్‌తో మాట్లాడేందుకు నమేమిరా అన్న గుండ దంపతులు



గుండ లక్ష్మీదేవితో చర్చిస్తున్న టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసులురెడ్డి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: శ్రీకాకుళం నియోజకవర్గంలో బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి అభ్యర్థిగా ఉన్న గొండు శంకర్‌ను మార్చి, గుండ లక్ష్మీదేవికి టిక్కెట్ కేటాయించాల్సిందేనని జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసులురెడ్డికి శ్రీకాకుళం నగర తెలుగుదేశం క్యాడర్ అల్టిమేటం జారీ చేసింది. నెల్లూరు నుంచి శ్రీకాకుళం జోనల్ కో ఆర్డినేటర్ శ్రీనివాసులురెడ్డి అరసవల్లిలోని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి నివాసానికి చేరుకొని వారితో సమావేశమయ్యారు. అనంతరం క్యాడర్‌తో మాట్లాడారు. చంద్రబాబునాయుడు గుండ దంపతులను తీసుకొని రమ్మన్నారని ఆ విషయాన్ని వారిద్దరికీ వివరించారు. దీనికి గుండ దంపతులు స్పందిస్తూ చంద్రబాబుతోనే మాట్లాడుతామని, టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌తోనైతే మాట్లేది లేదని ఖరాఖండిగా చెప్పేశారు. మరో రెండు మూడు రోజుల్లో వారు చంద్రబాబునాయుడును కలిసేలా ఏర్పాట్లు చేస్తానన్నారు. దీనిపై నగర తెలుగుదేశం నాయకులు మాట్లాడుతూ ఏది ఏమైనా శ్రీకాకుళం అసెంబ్లీ టిక్కెట్ లక్ష్మీదేవికి కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు. నగరానికి చెందిన 50 డివిజన్లలో 45 డివిజన్లకు చెందిన ఇన్‌చార్జులంతా గుండ లక్ష్మీదేవి వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. రెండేళ్లుగా క్రమశిక్షణ తప్పిన అసమ్మతి నేతకు టిక్కెట్ కేటాయించడంపై నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యకర్తల మనోభావాలను దృష్టిలో పెట్టుకొని ఇక్కడి పరిస్థితిని చంద్రబాబునాయుడుకు వివరించి లక్ష్మీదేవికి టిక్కెట్ వచ్చేలా చూడాలని కోరారు. దీనికి సమాధానంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మీ ఆవేదన తనకు అర్థమైందని చంద్రబాబు వద్దకు గుండ దంపతులను తీసుకెళ్లడం వరకే తన బాధ్యతని వివరించారు. టికెట్ ఇస్తే గుండకే ఇవ్వాలని, యూత్ కోటా అనుకుంటే వారి కుమారుడికి ఇవ్వాలే తప్ప గొండు శంకర్‌కి కన్ఫర్మ్ చేస్తే తాము ఒప్పుకోబోమని కార్యకర్తలు అన్నారు.

'టీడీపీ కార్యకర్తలంతా ఖండించాలి'

శ్రీకాకుళం: శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తమ నాయకురాలు గుండ లక్ష్మీదేవి తెలుగుదేశం అభ్యర్థిగా ఎంపిక కాకపోవడంపై తాము అసంతృప్తిగా ఉంటే అభ్యర్థిగా ఎంపికైన గొండు శంకర్ వీడియోల ద్వారా హెచ్చరికలు జారీ చేయడం సరికాదని పలువురు గుండ మద్దతుదారులు అన్నారు. బుధవారం పలువురు విలేకరులతో మాట్లాడుతూ తాము తమ నాయకురాలికి టిక్కెట్ రాలేదని ఆందోళనతో ఉంటే దాన్ని మరింత రెచ్చగొట్టే విధంగా రోడ్డుకీడుస్తాం, పప్పులుడకవు తదితర పదజాలాలను వినియోగించడాన్ని టీడీపీ కార్యకర్తలంతా ఖండించాలని కోరారు. గుండ కుటుంబానికి టిక్కెట్ ఇవ్వడం ఇష్టం లేకుంటే శంకర్‌కు కాకుండా వేరే ఎవరికి టిక్కెట్ ఇచ్చినా గెలిపించుకుంటామని, శంకర్ తరఫున పనిచేయబోమని స్పష్టం చేశారు. అభ్యర్థిని ప్రకటించే ముందు నియోజకవర్గ ఇన్‌చార్జిని గానీ, కార్యకర్తలను గానీ సంప్రదించకపోవడమే తమ ఆగ్రహానికి కారణమన్నారు. అధిష్టానం తమ నిర్ణయం మార్చుకోకుంటే గుండ లక్ష్మీదేవిని ఇండిపెండెంట్‌గా బరిలో ఉంచి గెలిపించుకుంటామన్నారు. సమావేశంలో మాదారపు వెంకటేశ్, తోణంగి వెంకన్న యాదవ్, కోటేశ్వరరావు, జామి భీమశంకరరావు, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, కొవ్వాడ సుశీల తదితరులు ప్రసంగించారు.

పెట్రోల్ బంక్‌లో పేలుడు

- గుర్తు తెలియని వ్యక్తుల దుశ్చర్య
- తప్పిన పెనుప్రమాదం



పేలుడు ధాటికి ధ్వంసమైన డీజిల్ పంపింగ్ మానిటర్ డిస్‌ప్లే

వజ్రపుకొత్తూరు: మండలంలోని గూనాలపాడు హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో మంగళవారం అర్ధరాత్రి పేలుడు సంభవించింది. బంక్‌లోని పెట్రోల్ పంపింగ్ చేసే మానిటర్ బాక్స్ నుంచి బాంబు పేలడంతో రెండు యంత్రాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ ఘటనతో పూండి ప్రాంతం ఉలిక్కిపడింది. గుర్తు తెలియని వ్యక్తులు పంపింగ్ బాక్స్ పగలుగొట్టి అందులో మందు గుండు సామగ్రి అమర్చి పేల్చినట్లు పోలీసులు తెలిపారు. బంక్‌లో ఉన్న సీసీ పుటేజీ ఆధారంగా నిర్ధారించారు. ఐతే దుండగులు ముఖం కనిపించకుండా జాగ్రత్త పడ్డారు. పేలుడు జరిగినట్లు అందులో పనిచేస్తున్న యువకులకు తెల్లవారితే తప్ప తెలియలేదు. ఉదయాన్నే 5 గంటల సమయంలో బంక్ యజమాని కొర్ల దేవీ మహాలక్ష్మికి బంక్‌లో పనిచేస్తున్న యువకులు సమాచారం ఇవ్వడంతో ఆమె వజ్రపుకొత్తూరు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీంతో వజ్రపుకొత్తూరు ఎస్ఐ సీహెచ్ రామరావు, శ్రీకాకుళం క్లూస్ టీం వచ్చి బంక్ పరిసరాలను పరిశీలించి ధ్వంసమైన మానిటర్‌పై ఉన్న వేలిముద్రలను సేకరించారు. బంక్ పరిసరాల్లో నివాస గృహాలు ఉన్నాయని, పెను ప్రమాదమే తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఐతే ఈ దుశ్చర్యపై తన అన్నదమ్ములు కొర్ల రవికుమార్, కొర్ల చంద్రశేఖర్ హస్తం ఉంటుందని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ రామారావు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



గుణుపల్లి ఎన్నికల కేంద్రంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ జీఆర్ రాధిక

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అక్కుపల్లి, బైపల్లి, గుణుపల్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఎస్పీ జీఆర్ రాధిక బుధవారం పరిశీలించారు. అక్కడి ఏర్పాట్లపై ఆరా తీశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఈవీఎంల భద్రతపై సమీక్ష



ఈవీఎం గోదాములను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టర్ కార్యాలయంలోని ఈవీఎం గోదాములను కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలసి బుధవారం తనిఖీ చేశారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా అక్కడి భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. గోదాములను తెరిపించి, నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన బ్లాకులను, ఈవీఎంలను పరిశీలించారు. గోదాముల్లోని సీసీ కెమెరాలను తనిఖీ చేశారు. అనంతరం మళ్లీ గోదాములకు సీళ్లు వేయించారు. అక్కడే పుటేజీని పరిశీలించారు. భారత ఎన్నికల సంఘానికి ఈ తనిఖీల సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు.

తనిఖీల్లో సంయుక్త కలెక్టర్ రాఘువేంద్ర మీనా, డీఆర్‌ఓ ఎం.గణపతి రావు, నోడల్ అధికారి సుధ, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు రౌతు శంకరరావు (వైఎస్సార్ సీపీ), పీఎంజే బాబు (టీడీపీ), సురేష్ సింగ్ (బీజేపీ) పలువురు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పది పబ్లిక్ పరీక్షలు

- 145 కేంద్రాల్లో నిఘా నడుమ సాఫీగా జరిగిన పరీక్షలు
- ఈ ఏడాది నమోదు కాని మాల్‌ప్రాక్టీసు కేసులు



శ్రీకాకుళం బలగ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ నుంచి పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: టెన్త్ పబ్లిక్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలో మార్చి 18వ తేదీన మొదలైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు-2024 ప్రధాన పేపర్లన్నీ బుధవారంతో ముగిశాయి. సంస్కృతం 30 మార్కులకు, ఒకటి రెండు ఒకేషనల్ కోర్సుల పేపర్లు మాత్రమే మిగిలి ఉన్నాయి. పరీక్షలు సాఫీగా, ప్రశాంతంగా ముగియడానికి సహకరించిన అధికారులు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్, అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ అలీఖాన్ కృతజ్ఞతలు తెలిపారు. ఏప్రిల్ ఒకటి నుంచి మూల్యాంకన ప్రక్రియ మొదలుకానుంది.

మాల్‌ప్రాక్టీసులు నిల్

జిల్లాలో నిత్యం నిఘా నడుమ పరీక్షలను నిర్వహించారు. ఈ ఏడాది ఎలాంటి మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదు కాకపోవడం గమనార్హం. ఆఖరి రోజు, ఏడోరోజు సోషల్ స్టడీస్ పేపర్‌కు విద్యార్థులు పరీక్ష రాశారు. జనరల్, ప్రైవేటు కలిపి 29,496 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 28,983 మంది పరీక్ష రాశారు. 513 మంది గైర్హాజరయ్యారు. నాడు-నేడుతో స్కూళ్లలో సదుపాయాలు కల్పించడంతో టెన్త్ విద్యార్థులు సాఫీగా పరీక్షలు రాశారు. ఫర్నీచర్, ఫ్యాన్లు, లైట్లు, ఆర్వోప్లాంట్ల ద్వారా తాగునీరు, మరుగుదొడ్లు ఇలా అన్ని మౌలిక సదుపాయాలు కలిగిన కేంద్రాల్లో పరీక్షలు రాశారు.



ఇచ్ఛాపురం: హోటల్‌లో విందు ఆరగిస్తున్న కె.శాసనాం హై స్కూల్ పదో తరగతి విద్యార్థులు

'ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి'



పొందూరులో 2కె రన్‌లో జేసీ నవీన్, మండల ఉద్యోగులు

పొందూరు: జిల్లాలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ కోరారు. పొందూరులో బుధవారం ఉదయం ఓటు హక్కు వినియోగంపై 2కే రన్‌ను నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి వాండ్రంగి జంక్షన్, అంబేడ్కర్ జంక్షన్ మీదుగా బస్టాండ్ వరకు 2కె రన్ నిర్వహించారు. నాలుగో ఫేజ్‌లో మే 13న పోలింగ్ జరగబోతోందని చెప్పారు. జిల్లాలో 2,355 పోలింగ్ స్టేషన్లు, పొందూరులో 79 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని చెప్పారు. ప్రజలంతా తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని చెప్పారు. బీఎల్‌ఓలంతా ప్రజలను చైతన్యం చేయాలని చెప్పారు. ఈ ఎన్నికల్లో కనీసం 85 శాతం ఓటింగ్ జరిగేలా ప్రజలను పోలింగ్ స్టేషన్ల వద్దకు తీసుకువచ్చేలా బీఎల్‌ఓలు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.పాల్‌కిరణ్, సచివాలయం సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, ఐకేపీ తదితర శాఖల సిబ్బంది హాజరయ్యారు.

2024 సమరం సన్నద్ధం

రూ.50వేలకు మించి తీసుకెళ్తున్నారా..?



ఆమదాలవలస రూరల్, హిరమండలం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా కోడ్ అమల్లోకి వచ్చింది. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో కేంద్ర బలగాలతో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. ప్రత్యేక చెక్‌పోస్టుల ద్వారా ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. నగదు, బంగారు ఆభరణా లు, మద్యం తదితరాలు పరిమితికి మించి తీసుకెళ్తే తప్పనిసరిగా లెక్క చూపించాలి. ఇప్పటికే జిల్లాలో పలు ప్రాంతాల్లో తని ఖీల్లో ఆధారాల్లేని నగదు, ఇతర వస్తువులు దొరుకుతున్నాయి. ఎన్నికల సందర్భంగా రూ. 50 వేల వరకు మాత్రమే నగదు తీసుకెళ్లేందుకు ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చింది. అంత కంటే ఎక్కువగా నగదు సామాన్యులు తరలిస్తే పూర్తిగా వివరణ ఇవ్వాలి. ఆ డబ్బు ఎక్కడ నుంచి వచ్చింది? ఎక్కడకు తీసుకువెళ్తున్నారు? తదితర విషయాలు చెప్పాల్సి ఉంటుంది. మీ సమాధానంలో తేడా ఉన్నా చెప్పిన దానిలో వాస్తవం లేకపోయినా ఆ నగదును అధికారులు స్వాధీనం చేసుకుంటారు. సరైన పత్రాలు చూపించాకే మీ నగదు మీకు తిరిగి అప్పగిస్తారు. అంతవరకు మీ నగదు కోర్టు కస్టడీలో ఉంటుంది. ఎన్నికల కౌంటింగ్ అయ్యేంత వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయి. నగదే కాకుండా బంగారం, వెండి తదితర ఆభరణాలు, విలువైన వస్తువులు ఏవైనా సరే అనుమానం వస్తే అధికారులు స్వాధీనం చేసుకుంటారు. బంగారం వెండి త దితర వస్తువులు సైతం తగిన పత్రాలు పట్టుకుని మాత్రమే ప్రయాణాలు చేయాలి. లేకుంటే చిక్కులు తప్పవు.

ఖాతాలు జాగ్రత్త..

అపరిచిత వ్యక్తులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి వ్యక్తిగత ఖాతాలకు నగదు జమ చేసే అవకాశం ఇవ్వకూడదు. గత ఆరు నెలల్లో ఖాతాల్లో జమైన మొత్తాలకు మించి నగదు జమ కాకుండా చూసుకోవాలి. ఒక వేళ ఖాతాలో జమైన మొత్తాలకు సంబంధించి అధికారుల్లో అనుమానం ఉంటే ఆధారా లు చూపేందుకు సిద్ధంగా ఉండాలి. అవకాశం ఉన్నంత వరకు ఇతరులకు ఖాతా నంబర్‌ను చెప్పకపోవడం మంచిది. వివాహాలు, ఇతర శుభకార్యాలు, అత్యవసర వైద్య ఖర్చులు, వ్యాపార చెల్లింపులు చేసే వారు తగిన ఆధారాలతో నగదు తీసుకువెళ్లాలి. ఆన్‌లైన్ చెల్లింపుల వివరాలు కూడా ఉంచుకోవడం ఉత్తమం అని పోలీసులు, అధికారులు సూచిస్తున్నారు.

తగిన బిల్లులు తీసుకోవాలి

ఎన్నికల కోడ్ ప్రతి ఒక్కరికీ వర్తింపజేయడంతో సామాన్యులు సైతం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుతం వివాహాల సీజన్ కావడంతో బంగారం, వస్త్రాలు కొనుగోలు ఎక్కువగా జరుగుతుంది. అందుకు తగిన సరైన వివరాలు లేకపోతే ఇబ్బందులు తప్పవు. వీటి కొనుగోలుకు తీసుకువెళ్లే నగదు విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని, సంబంధిత దుకాణాల నుంచి బిల్లులు తీసుకోవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

రైస్‌మిల్లులో చోరీ

కోటబొమ్మాళి : మండల కేంద్రంలోని కోటబొమ్మాళి సంతోషిమాత గుడి వద్ద సూర్యరత్న రైస్‌మిల్లులో మంగళవారం అర్ధరాత్రి దొంగలు చొరబడ్డారని మిల్లు యజమాని సకలాభక్తుల వైకుంఠరావు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగలు ప్రహరీని దూకి వాచ్‌మేన్‌ను కత్తులతో భయపెట్టి మిల్లులోకి చొరబడి రూ.3వేలు నగదు, కొన్ని వస్తువులు దోచుకుపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దొంగలు సీసీ కెమెరా సెటాప్ బాక్సును పట్టుకుపోయారని, విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ మహమ్మద్ అలీ తెలిపారు. ఇదే రైస్‌మిల్లులో నెలరోజుల కిందట దొంగలు చొరబడి రూ.40 వేలు నగదు ఎత్తుకుపోయారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని లచ్చన్నపేట సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. పలాస నుంచి టెక్కలికి ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు కారులో వస్తుండగా లచ్చన్నపేట వద్ద వారి ముందు వెలుతున్న టిప్పర్ ఒక్కసారిగా మలుపు తిప్పడంతో ఢీకొట్టారు. ఈ ఘటనలో కారు కొంతవరకు పాడైపోగా లోపల ఉన్న చిన్నారితో పాటు భార్యాభర్తలు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

పోగొట్టుకున్న బ్యాగు తిరిగొచ్చింది!



బాధితునికి ఆటో డ్రైవర్ ద్వారా బ్యాగు, వెండి పళ్లెం అప్పగిస్తున్న సీఐ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలో ఓ వ్యక్తి ఆటోలో బ్యాగు మరిచి ఇంటికి వెళ్లిపోయాడు. తీరా బ్యాగు పోగొట్టుకున్నానని తెలుసుకున్నాక రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించగా వారు కనిపెట్టి బాధితునికి బ్యాగు ఇప్పించారు. సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 24న ఉదయం నగరానికి చెందిన చిరువ్యాపారి మల్లా సంతోష్‌కుమార్ కుటుంబంతో కలిసి నిశ్చితార్థ శుభకార్యం నిమిత్తం విశాఖపట్నం బయల్దేరాడు. ఆర్టీసీ కాంప్లెక్సులో బస్సు ఎక్కేందుకు గాంధీపార్కు వద్ద ఆటో ఎక్కాడు. దిగేటప్పుడు బ్యాగు మరిచి వెళ్లిపోయాడు. అందులో రూ. 20 వేలు విలువైన వెండి పళ్లెం, కొత్త దుస్తులు ఉన్నాయి. తీరా ఫంక్షన్‌కు వెళ్లి చూశాక లేకపోవడంతో అటు నుంచి వచ్చి పోలీస్ స్టేషన్‌లో అదే రోజు రాత్రి ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంతోష్‌కుమార్ ఆటో ఎక్కిన, దిగే సమయాన్ని బట్టి సీసీ ఫుటేజీ పరిశీలించారు. ఆటో రిజిస్ట్రేషన్ నంబరును తెలుసుకుని విచారించగా కిష్టప్పపేటకు చెందిన పి.రామారావు ఆటో అని గుర్తించారు. దీంతో బుధవారం రామారావును రప్పించి బ్యాగును బాధితుడు సంతోష్‌కుమార్‌కు సీఐ అప్పగించారు.

జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కిలారి



కిలారి ఈశ్వరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : జిల్లా న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కిలారి ఈశ్వరరావు ఎన్నికయ్యారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బార్ కార్యాలయంలో జరిగిన ఎన్నికలో ఈశ్వరరావు 241 ఓట్లు, కూన రాజారావు 176 ఓట్లు, ఎన్ని సూర్యారావు 76 ఓట్లు పొందారు. రెండు ఓట్లు చెల్లలేదు. జాయింట్ సెక్రటరీ పోస్టుకు ఇద్దరు పోటీ పడగా అందులో పీసా చంద్రశేఖర్ విజయం సాధించారు. మిగిలిన పోస్టులు ఏకగ్రీవం కావడంతో ఎన్నికలు జరగలేదు. ఎన్నికల అధికారిగా కంచరాన నాగభూషణరావు వ్యవహరించారు.

● గెలుపే లక్ష్యం..!

గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ఊరూవాడా పర్యటిస్తూ ఓటర్లను కలుస్తూ తమనే గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పార్టీ కరపత్రాలను పంపిణీ చేస్తూ ఆప్యాయంగా పలకరిస్తున్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో అమూల్యమైన ఓటు హక్కును తమ గుర్తుపైనే వేసి గెలిపించాలని కోరుతున్నారు. - సాక్షి నెట్‌వర్క్



పోలాకి: రాళ్లపాడులో అభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



పాతపట్నం: చంగుడి గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



సంతబొమ్మాళి: ఓ వివాహ వేడుకలో వంట చేస్తున్న టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



ఎచ్చెర్ల: లావేరులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్ సతీమణి పరిమళ

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి..

కాశీబుగ్గ: అవగాహన లేని రాజకీయ నాయకులు తమకు వద్దని, 60 ఏళ్లు ఈ ప్రాంతాన్ని పరిపాలించి అభివృద్ధి చేయలేని కుటుంబ పాలన కంటే ఐదేళ్లలోనే 60 ఏళ్ల అభివృద్ధి చేసి చూపిన మంత్రి సీదిరి అప్పలరాజుతోనే తమ ప్రయాణమని పలువురు యువకులు బుధవారం మంత్రి సీదిరి అప్పలరాజు సమక్షంలో పార్టీలో చేరారు. వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటకు చెందిన శ్రీసాగర్ వివేకానంద యువజన సేవా సంఘం అధ్యక్షుడు పరిమిల్లు తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు దుమ్ము లక్ష్మయ్య, కోశాధికారి సింగర్ వేణు, సెక్రటరీ పరిమిల్లు లింగరాజుతో పాటు 15 మంది సభ్యులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సీదిరి అప్పలరాజు సమక్షంలో పార్టీలో చేరిన మంచినీళ్లపేట యువకులు

పోలాకి: మండలంలోని వనవిష్ణుపురంలో 20 కుటుంబాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జోనల్ ఇన్‌చార్జి, జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, ముఖ్యమంత్రి జగన్ పరిపాలనకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు పాలిన తిరుపతిరావు, బొల్ల మహేశ్వరరావు, పాలిన అప్పన్న, బొల్ల తాతారావు, కూర్మాన గిరి, వంకల భాస్కరరావు, కూర్మాన జగన్నాయకులు చెప్పారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచేందుకు తామంతా సిద్ధమని గ్రామ యువత ప్రకటించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కలగదండు తాతారావు, పార్టీ మండల యువజన నాయకుడు నర్సింగ్‌యాదవ్ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో పేరాడ తిలక్



దువ్వాడ శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న కోదండపురం టీడీపీ కార్యకర్తలు

నీటి సంఘం మాజీ అధ్యక్షుడు చేరిక

నరసన్నపేట: మండలంలోని కామేశ్వరిపేటకు చెందిన టీడీపీ నాయకుడు, నడగాం నీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఇసా కామేశ్వరరావు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామంలో ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సమక్షంలో ఈయన వైఎస్సార్ సీపీ కండువా కప్పుకున్నారు. ఈయన చేరికతో కామేశ్వరిపేటతో పాటు పరిసర గ్రామాల్లో పార్టీ మరింత అభివృద్ధి చెందుతుందని కృష్ణదాస్ అన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందించారని, అందుకే పార్టీలో చేరానని కామేశ్వరరావు తెలిపారు.



కామేశ్వరరావుకు వైఎస్సార్ సీపీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

టెక్కలి: మేఘవరం పంచాయతీ కోదండపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం టెక్కలిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ సమక్షంలో గ్రామానికి చెందిన కొర్రాయి సూర్యనారాయణ, గంట సుందరరావు, నాగేశ్వరరావు, యాళ్ల రామారావు, కృష్ణారావు, కుంభనాథం, యడ్ల రమేష్, ధర్మారావు, చిరంజీవులు, కర్ణికరావు, నీలావు సింహాచలం, మల్లిపురం ధర్మారావు, సీతన్న, సూరి, గొర్లె అంగద, సంతోష్, శివ తదితరులు వైఎస్సార్‌సీపీ కండువాలు ధరించారు. దీంతో కోదండపురంలో టీడీపీ శూన్యంగా మారింది. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కె.అజయ్, నాయకులు పి.జపాన్‌రావు, జె.చంద్రయ్య, డి.కామన్న, ఎస్.హరినారాయణ, రాజు, బమ్మిడి తులసీరావు, పి.వైకుంఠరావు పాల్గొన్నారు.

పలాస ప్రాంత ప్రజలకు మల్టీ స్పెషాలిటీ వైద్యం

కాశీబుగ్గ: పలాస ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి సాయి శ్రీనివాస మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని రైల్వే గేట్ సమీపంలో పాత జాతీయ రహదారికి ఆనుకుని ఏర్పాటుచేసిన సాయి శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని బుధవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ టి.బాలకృష్ణ ఆలోచనలు ఉన్నతంగా ఉన్నాయని, మంచి వాతావరణంలో ఆసుపత్రి నిర్మించారని చెప్పారు. ఎం.వి.జ్యోత్స్న ప్రసూతి వైద్యురాలిగా మంచి సేవలు అందిస్తున్నారని, ప్రస్తుతం అన్ని సేవలు ఒకే కాంప్లెక్సులో లభిస్తాయని పేర్కొన్నారు. అనంతరం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ప్రముఖ వైద్యులు, నాయకులు, తదితరులు హాజరయ్యారు.



సాయిశ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

పెయింటర్‌కు గాయాలు

టెక్కలి రూరల్ : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని సత్యసాయి నగర్‌లో ఇటీవల నిర్మాణం చేపట్టిన నాలుగు అంతస్తుల బిల్డింగ్‌కు రంగులు వేస్తుండగా పరంజీ విరిగిపోవడంతో టెక్కలి ఆదిఆంధ్ర వీధికి చెందిన కిర్రి జగన్నాథం కిందపడి గాయాలపాలయ్యాడు. తలకు బలమైన గాయం తగలడంతో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. టెక్కలి పోలీసులు వివరాలు సేకరించారు.

కమిటీ నివేదికలు బయటపెట్టాలి



రిజిస్ట్రార్ సుజాతకు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పూర్వపు వీసీ నిమ్మ వెంకటరావు అక్రమ నియామకాలు, ఇతర అంశాలపై ఏర్పాటు చేసిన మూడు కమిటీలు నివేదికలు బయట పెట్టాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు బుధవారం వర్సిటీ పరిపాలన కార్యాలయంలో రిజిస్ట్రార్ పి.సుజాతకు వినతి పత్రం అందజేశారు. కమిటీ నివేదికలను ఎందుకు బహిర్గతం చేయడం లేదని ప్రశ్నించారు. నిబంధనలకు వ్యతిరేకంగా నియమించిన 34 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఎందుకు తొలగించడం లేదన్నారు. నెల రోజుల్లో కమిటీ నివేదికల ఆధారంగా చర్యలు ప్రారంభించకపోతే ప్రత్యక్ష పోరాటం చేస్తామని హెచ్చరించారు. రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో దళిత సంఘాలు నాయకులు మిస్కా కృష్ణయ్య, దుర్గాసి గణేష్, టొంపాల రమణ ఉన్నారు.

స్థల వివాదంపై కేసు నమోదు

రణస్థలం : మండలంలోని వెల్బురాయి గ్రామంలో మూడు సెంట్లు స్థల వివాదం ఇరువర్గాల మధ్య కొట్లాటకు దారితీసింది. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దేబారికి నర్సింహులు, దేబారికి రాము మాస్టారు కుటుంబాల మధ్య కొన్నేళ్లుగా స్థల వివాదం జరుగుతోంది. దీనిపై పలుమార్లు రెవెన్యూ అధికారులు, పోలీసులు వచ్చి ఇరువర్గాలకు సర్దిచెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 25న ఇరువర్గాల మధ్య కొట్లాట జరగడంతో ఒక వర్గానికి చెందిన దేబారికి రాధ, మరో వర్గానికి చెందిన దేబారికి నర్సింహులు, ఉగాదిలు గాయపడి శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై జె.ఆర్.పురం ఎస్సై కె.గోవిందరావు ఇరువర్గీయులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెజ్లింగ్ క్రీడాకారుడికి రజతం

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన రెజ్లింగ్ క్రీడాకారుడు శివచరణ్ ఈ నెల 21, 22 తేదీల్లో చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో రజత పతకం సాధించాడు. 72 కిలోలు విభాగంలో సత్తాచాటి ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా శివచరణ్‌ను బుధవారం కళాశాలలో ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, మేనేజ్‌మెంట్ సభ్యులు పి.దుర్గాప్రసాద్‌రాజు, అధికారులు, ఫ్యాకల్టీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.



శివచరణ్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఎన్నికల ప్రచారానికి అనుమతి తప్పనిసరి

● జాయింట్ కలెక్టర్ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్ : ఎన్నికల ప్రచారానికి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో 39వ వారాంతపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రచారాలు, పోస్టర్లు, ర్యాలీలు, రోడ్డు షోలకు రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతులు పొందాలని తెలిపారు. సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో 48 గంటల ముందుగానే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటికే జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేపడుతున్నామన్నారు. పోలింగ్ బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్లు 150 శాతం సిద్ధం చేశామన్నారు. నామినేషన్ స్వీకరణ తేదీ వరకు కొత్త ఓటర్లను చేర్పించుకోవచ్చన్నారు. తొలగించడం మాత్రం కుదరదని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్వో ఎం.గణపతి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవీన్

పీడీఎస్ బియ్యం పట్టివేత

నందిగాం : మండలంలోని కాపుతెంబూరు, దేవుపురం తదితర గ్రామాల నుంచి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అధికారులు బుధవారం పట్టుకున్నారు. సివిల్ సప్లయ్ డీటీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో కాపుతెంబూరులో తనిఖీలు చేస్తుండగా అక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న 953 కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సోంపేటకు చెందిన సానా మనోహర్ పలు గ్రామాల్లో ఈ బియ్యాన్ని కిలో రూ.10 నుంచి రూ.12లకు కొని రూ.20కు అమ్ముకుంటున్నాడని, అక్రమంగా తరలిస్తున్నందున 6ఏ కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసి నందిగాం పోలీస్ స్టేషన్‌కు తరలించామని, బియ్యాన్ని టెక్కలి ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామని డీటీ మురళీకృష్ణ తెలిపారు. తనిఖీల్లో ఆర్ఐ కిరణ్, కాపుతెంబూరు వీఆర్వో తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న బియ్యంతో అధికారులు

అనాథ పిల్లల పేరిట రూ.లక్ష డిపాజిట్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆపదలో ఉన్న వారిని మానవత్వంతో ఆదుకోవడం గొప్ప విషయమని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. ఎచ్చెర్లకు చెందిన కొండేటి శంకరరావు, ఝాన్సీరాణి దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుమారులు సాయిశరత్, దుర్గాప్రసాద్‌లు అనాథలయ్యారు. వీరిని ఆదుకునేందుకు ఎచ్చెర్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది లక్ష రూపాయలు విరాళాలు సేకరించి పోస్టాఫీసులో ఫిక్సిడ్ డిపాజిట్ చేశారు. దీనికి సంబంధించిన బాండ్ పుస్తకాలను బుధవారం కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు పారుపల్లి శ్రీనివాసరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్ఎం గట్టు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



ఫిక్సిడ్ డిపాజిట్ పుస్తకాలను అందజేస్తున్న కలెక్టర్

ఘనంగా మదీనాబాబా చందనోత్సవం



అంగరఖాను తీసుకువస్తున్న ముస్లింలు

గార: కళింగపట్నం మదీనాబాబా ఉరుసు చందనోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. రంజాన్ నెలలో నెలవంక ప్రారంభమైన 16 రోజుల తర్వాత బాబాకు ఉరుసు ఉత్సవం నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో హజరత్ మదీనా బాబా దర్గా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు చందనోత్సవం కార్యక్రమం వైభవోపేతంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం బాబా సమాధి ఎదురుగానున్న ప్రార్థనా మందిరం నుంచి చాదర్ (అంగరఖా)ను ఊరేగింపుగా తీసుకువచ్చారు.

బాబా సమాధిపై ఉంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బాబాకు ఉన్న చందనాన్ని తీసి కొత్త చందనం పూశారు. తెల్లటి వస్త్రాన్ని కప్పి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. బాబాకు ఇష్టమైన అటుకులు ప్రసాదాన్ని సమర్పించారు. పూలతో పూజించి భక్తులు ఉపవాసాలు చెల్లించారు. ఉత్తరాంధ్ర నుంచి అధిక సంఖ్యలో ముస్లింలతో పాటు హిందువులు తరలివచ్చి చందనోత్సవంలో పాల్గొన్నారు.

కన్యాశుల్కం ప్రదర్శన అదరహో..!

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో బుధవారం ప్రపంచ రంగస్థల కళాకారుల దినోత్సవం పురస్కరించుకొని సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం నాటక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి మాట్లాడుతూ కన్యాశుల్కం నాటక ప్రదర్శన సమాజాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. అనంతరం ప్రముఖ కళాకారులు మళ్లా సూర్యనారాయణ(పాతటెక్కలి), పి.టి.మాధవ్ (విశాఖ), ఎల్.రుద్రమూర్తి(భిలాయ్), జి.వరప్రసాద్(విజయనగరం)లను సమితి తరఫున సత్కరించారు. సమితి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, అధ్యక్ష కార్యదర్శులు ఇప్పిలి శంకరశర్మ, గుత్తు చిన్నారావు, కోశాధికారి నక్క శంకరరావు, డాక్టర్ పులంఖడం శ్రీనివాసరావు, ఉపకోశాధికారి కొంక్యాన మురళి, మెట్ట పోలినాయుడు, కొమనాపల్లి సురేష్, బంకుపల్లి శంకరం, మల్లెమొగ్గల రాజు, తదితరులు పాల్గొన్నారు.



కళాకారులను సత్కరిస్తున్న సుమిత్రా కళాసమితి సభ్యులు

ఆకట్టుకున్న అభినయం..

సుమిత్రా కళాసమితి పర్యవేక్షణలో ఇప్పిలి శంకరశర్మ దర్శకత్వంలో ప్రదర్శించిన కన్యాశుల్కం నాటకం ఆద్యంతం అలరించింది. సుమారు 6 గంటలు ఉండే ఈ నాటకాన్ని రెండు గంటలకు కుదించి ముఖ్య సన్నివేశాలను చక్కగా ప్రదర్శించారు. గిరీశంగా విజయరామ్, మధురవాణిగా రాజేశ్వరి, రామప్పపంతులుగా బోసుబాబు, లుబ్ధావధానులుగా పి.ఎస్.ఎస్.శాస్త్రి, బంట్రోతుగా చిన్నారావు, శిష్యుడిగా వి.వి.ఆర్.మూర్తి, అగ్నిహోత్రావధానులుగా శాంతారాం, వెంకటేశంగా ఆదిత్య, కరటక శాస్త్రిగా లక్ష్మణరావు, సిద్ధాంతిగా సురేష్, బుచ్చెమ్మగా సునీతారాణి, వెంకమ్మగా అన్నపూర్ణ, పూటకూళ్లమ్మగా జ్యోతి, సుబ్బిగా పూజితలు చక్కగా నటించగా, సంగీతం లీలామోహన్ అందించారు.



నాటకంలో ఓ సన్నివేశం